అనువాద కథలు

# నాన్నా!! తొందరగా వచ్చేయ్



కొల్లూరి సోమ శంకర్

# ఇందులో...


| | | |
|---|---|---|
| కథా కదంబాల పరిమళాలు | | iv |
| కృతజ్ఞతలు.... | | vi |
| 1. | అమృతవర్షిణి | 1 |
| 2. | బేరం | 7 |
| 3. | వాళ్ళిద్దరూ, ఆటో డ్రైవరు | 9 |
| 4. | అనగనగా... | 12 |
| 5. | నాన్నా!! తొందరగా వచ్చేయ్ | 15 |
| 6. | అమ్రికావాలా | 20 |
| 7. | ఇజంలో ఇంప్రిజన్ | 26 |
| 8. | శిథిలం | 30 |
| 9. | ప్లాస్టిక్ హృదయం | 35 |
| 10. | ఆపరేషన్ బిర్యానీ | 39 |
| 11. | బుద్ధి మాంద్యం | 45 |
| 12. | వృక్ష ప్రేమికుడు | 51 |
| 13. | భయం నీడ | 54 |
| 14. | నల్ల ధనం... Null ధనం | 57 |
| 15. | గృహ గోధికా ప్రహసనం (బల్లి దోషం) | 60 |

# నాన్నా!! తొందరగా వచ్చేయ్

గబగబా తన ఇంటవైపు అడుగులేస్తున్నాడు ఎనిమిదేళ్ళ అమిత్. వీధి లోంచి వస్తున్నప్పుడు తెరచి ఉంచిన కొట్లలో గడియారాలేమయినా కనిపిస్తాయేమోనని చూడసాగాడు – సమయం తెలుసుకోడానికి. ఒక కొట్లోని గడియారం రాత్రి 7.15 అవుతోందని చూపించింది. వాళ్ళ నాన్న ఆఫీసు నుంచి ఇంటికి చేరే సమయం కన్నా పావుగంట ఎక్కువ. అమిత్ నడకలో వేగం పెంచాడు.

అమిత్‌కి ఆ రోజు ఇంకా బాగా గుర్తు. ఆ రోజు ఇలాగే ఇంటికి ఆలస్యంగా వచ్చినందుకు వాళ్ళ నాన్న వీపు విమానం మోత మోగించాడు. 'ఆ మాత్రం ఆలస్యానికే అంతలా కొట్టాలా? నాన్నెందుకు అంత కోపంగా ఉంటాడు? మరి తమ్ముడు అనిల్‌ని కొట్టడేం? వాడికింకా నాలుగేళ్ళేననా? నాకు మాత్రం టైం ఎలా తెలుస్తుంది? గ్రౌండ్‌లో గడియారం లేదే? పైగా సూర్యుడు కూడా వాళ్ళింటికి ఆలస్యంగా వెళ్ళాడు. మరి నేనేం చేసేది? ఆలస్యం అయిందని తెలియలేదు' ఇలా సాగాయి వాడి ఆలోచనలు.

"దేవుడా, ఈ రోజు నాన్న ఇంటికి కొంచెం ఆలస్యంగా వచ్చేటట్టు చూడు" అంటూ దేవుడిని ప్రార్థించాడు. మరో ఐదు నిముషాలలో తన ఇంటి ముందున్నాడు అమిత్. నాన్న వచ్చాడో లేదో తెలుసుకోవాలనుకున్నాడు. తలుపుకి దగ్గరగా నిలుచుని, చెవులు రిక్కించి వినసాగాడు. లోపల్నించి ఎటువంటి మాటలు వినపడడం లేదు. అమిత్ ముఖంపై ఓ చిరునవ్వు విరిసింది. మెల్లిగా తలుపు తీసుకుని, పిల్లిగా లోపలికి అడుగు పెట్టాడు. అమిత్‌ని చూస్తూనే అనిల్ 'అన్నయ్యా' అంటూ అరిచాడు.

వాడిని అక్కడికక్కడే ఓ మొట్టికాయ వేద్దామనుకున్నాడు అమిత్. ఇంతలో వంటింట్లోంచి " ఇప్పటిదాకా ఎక్కడికి వెళ్ళావు? టైం ఏడున్నర అవుతోంది. ఆలస్యంగా ఇంటికి రావడం నాన్నకిష్టం ఉండదు. నీకు తెలుసుగా" అంటూ అరిచింది అమ్మ.

అమిత్ ఏమీ మాట్లాడలేదు. తనేం మాట్లాడినా అది మరింత గొడవకి దారితీస్తుందని అమిత్‌కి తెలుసు. మౌనం రక్షణాత్మకం! కాళ్ళు, చేతులు కడుక్కున్నాడు. నాన్న ఇంకా రాలేదు. ఇది చాలా అసాధారణం. ఎందుకంటే నాన్న ఎప్పుడూ ఏడుగంటల కల్లా ఇంటికి వచ్చేస్తాడు. ఈ పూట దాదాపు ఎనిమిది అవుతున్నా ఇంకా రాలేదు. అమిత్‌కి సంతోషంగా ఉంది. తన్నులు తప్పాయని ఆనందంగా ఉంది. టి.వి. ఆన్ చేసి సాయంత్రం వచ్చే కార్యక్రమాలు చూడసాగాడు. వేసవి సెలవలు కావడంతో చేయడానికి హోం వర్క్ ఏదీ లేదు. అనిల్ నేల మీద బొమ్మలతో ఆడుకుంటున్నాడు.

అమ్మేమో నాన్న కోసం ఎదురుచూడసాగింది. ఓ అరగంట గడిచింది. అమ్మకి కంగారు మొదలైంది. టేబుల్ పైన ఉన్న టెలిఫోన్ డైరక్టరీని అందుకుంది.

"తమ్ముడిని చూస్తూండు. నేను నాన్న వాళ్ళ ఆఫీసుకి ఫోన్ చేసి వస్తాను..." అంటూ బయటకు వెళ్ళడానికి సిద్ధమవసాగింది. ఆమె ముఖంలో ఆందోళన వ్యక్తమవుతోంది.

అమిత్ ఏమీ మాట్లాడలేదు. అమ్మ ఫోన్ చేయడానికి వెళ్ళింది. 'పక్కింటి షీలా ఆంటీ వాళ్ళింటికి ఫోన్ చేసి రావడం ఆలస్యం అవుతుందని నాన్న చెప్పచ్చు కదా?' అని అనుకున్నాడు. ఆ చుట్టూ పక్కల ఇళ్ళలో ఫోన్ ఉన్నది షీలా వాళ్ళింట్లోనే. అమ్మ కష్టపడడం అమిత్‌కి ఇష్టం లేకపోయింది. 'అమ్మ ఎంతో మంచిది. నాన్నే పిసినారి. పైగా ఎప్పుడూ నామీద అరుస్తునే ఉంటాడు. అమ్మని కూడ తిడతాడేమో' అనుకున్నాడు .

ఓ పావుగంట తర్వాత అమ్మ తిరిగి వచ్చింది. ఆమె ముఖం చూస్తే సంతోషకరమైన వార్త ఏదీ అందినట్లు లేదు. టి.వి. చూస్తూ అమ్మనే గమనించసాగాడు. ఆమె గుమ్మం కేసే చూడసాగింది. సమయం తొమ్మిది కావచ్చింది. నాన్న రెండు గంటలు లేటు!

ఇప్పుడు అమిత్‌కి కూడ భయం పట్టుకుంది. టి.వి. చూడబుద్ధి కాలేదు. ఆపేసి అక్కడినుంచి లేచాడు.

"అమిత్, నువ్వు తమ్ముడు అన్నం పెట్టుకుని తినేయండి" అంది అమ్మ.

"నువ్వు తినవా?"

"నాన్న వచ్చాక"

అమిత్ నిశ్శబ్దంగా వంటింట్లోకి వెళ్ళి తనకి, తమ్ముడికి కంచాలలో అన్నం పెట్టుకున్నాడు. అనిల్ ఇవేవి పట్టనట్లు తన బొమ్మ రైలుతో హాయిగా ఆడుకున్నాడు. వాడిని పిలిచి అన్నం పెట్టడానికి అమిత్ చాలా కష్టపడ్డాడు.

అనిల్ గబగబా తల్లి దగ్గరికి పరిగెత్తి, "అమ్మా, నాన్న ఎప్పుడొస్తాడు?" అని అడిగాడు. అమ్మకి అసలే చికాకుగా ఉంది.

"అమిత్, వీడికి అన్నం తినిపించు" అంటూ అరిచింది. ఏడుస్తున్న తమ్ముడిని లాక్కెళ్ళి కుర్చీలో కూర్చోబెట్టి నోట్లో ముద్దలు పెట్టసాగాడు అమిత్. అనిల్ ఏడుస్తుంటే వాడి కన్నీళ్ళు అన్నంలో కలుస్తున్నాయి. వాడికి అన్నం తినిపించి, తానూ తినేసి తమ్ముడిని మంచం మీద పడుకోబెట్టి టి.వి. ఆన్ చేసాడు. వాడు టి.వి. చూడసాగాడు. అమిత్ వెళ్ళి అమ్మ దగ్గర నిలుచున్నాడు. ఆమె భర్త కోసం ఎదురుచూస్తూ ఉంది.

# అమ్రికావాలా

నాలుగేళ్ళ నా కూతురు నా ముఖాన్ని ఒడిలో పెట్టుకుని గట్టిగా బిగించి పట్టుకుంది. "ఎప్పటికీ, నిన్నెప్పటికీ వదలను నాన్నా, నా చేతులను దాటి నిన్నెక్కడికీ వెళ్ళనివ్వను" అని ఆ చర్యకి అర్థమని నాకు తోచింది.

ఎయిర్‌పోర్ట్‌లో రద్దీ పెరిగిపోతోంది. ఎలాగోలా మెల్లగా పాప చేతుల్లోంచి ముఖాన్ని విడిపించుకున్నాను. పక్కనే నా భార్య నిలుచుని ఉంది. ఆమె కన్నుల్లో కొద్దిగా ఆనంద బాష్పాలు. నేను క్షేమంగా చేరినందుకు దేవుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటోందేమో. నాకూ కన్నీరొచ్చింది. కాని స్వదేశం తిరిగి చేరినందుకు కాదు, మరో కారణంగా. నేను సజీవంగా తిరిగొచ్చిన మాట వాస్తవమే కానీ, నా ప్రాణం మాత్రం అక్కడే ఉండిపోయింది. నన్నొక మానసిక రోగిలా భావించి నా శరీరాన్ని, మనసుని వెనక్కి పంపేశారు. కాని నా మస్తిష్కాన్ని మాత్రం అక్కడే వదిలేసి వచ్చాను.

***

నా పేరు స్టీవ్ జేకబ్‌సన్. నేను అమెరికా సైన్యంలో ఓ సిపాయిని. నన్ను ఇరాక్ వీధులలోకి పంపారు. శాంతి నెలకొల్పడం, బాధితులను వాళ్ళ ఇళ్ళకు చేర్చడం, కాల్పులు జరగకుండా చూడడం మా పని. దాడులు పూర్తయ్యాయి. ఇప్పుడు రక్షించే పని. ఏడిపించడం అయింది, ఇక కన్నీళ్ళు తుడవడమే మిగిలింది.

రోజంతా మేము శిథిలాల క్రింద నుంచి వచ్చే బలహీనమైన ఆక్రందనల కోసం అన్వేషిస్తుంటాము. కొన్నిసార్లు మా ప్రయత్నాలు సఫలమవుతాయి. కొన్నిసార్లు వృథా అవుతాయి. పారలతోను, గడ్డపారలతోను, యంత్రాలతోను పెద్ద పెద్ద శిథిల భవనాల గోడలను, నిర్మాణాలను తొలగిస్తూ వాటిల్లో చిక్కుకున్న వారికి మా చేతులు అందించి రక్షిస్తూ ఉంటాము.

కొంతమంది క్షతగాత్రులు మా సాయాన్ని తిరస్కరిస్తారు. మా చేతుల్లోంచి వాళ్ళ చేతులను వెనక్కి లాగేసుకుంటారు. "మీ సాయం మాకక్కర్లేదు, మీ దయ మాకొద్దు, మీ స్నేహం అసలే వద్దు" అన్నట్లుంటాయి వారి చూపులు. మేము వాళ్ళ కళ్ళల్లో కళ్ళుపెట్టి ఆత్మీయతని, భరోసాని కలిగించాలని చూస్తాము. బదులుగా వాళ్ళ కళ్ళల్లో అసహ్యం వ్యక్తమవుతుంటుంది. కొంతమంది పుట్టెడు దుఃఖంలో ఉంటారు. అసహ్యానికి, ప్రేమకి మధ్య తేడా తెలియనంత దుఃఖంలో ఉంటారు. ఎంత బాధలో ఉంటారంటే వారికి ఓ కన్నీటి చుక్క సైతం సాంత్వన కలిగిస్తుంది.

హఠాత్తుగా, నా ముందున్న శిథిలమైన ఇంటి గదిలో చీకట్లో ఏదో అలికిడైంది. చిరిగిన, సగం కాలిన అందమైన గౌనులో ఉన్న ఓ నాలుగు లేదా ఐదేళ్ళ పాప తన బంగారు కురులపై రేగుతున్న ధూళితో గబగబా మరో గదిలోకి పరిగెత్తి, గోడ చాటున దాక్కుంది – ఏదో ఆపద ఎదురవగానే కుందేలు ఒక పొద నుంచి మరో పొదకి పరిగెత్తినట్లుగా.

"పారిపోవద్దు. నేను నీకు సాయం చేయడానికి వచ్చాను"

కానీ ఈ మాటల వలన ఏం ప్రయోజనం? గోడకు కొట్టిన బంతిలా, నా మాటలు వెనక్కి వచ్చాయి. ఆ పాప ఇంగ్లీషు ఎలా అర్థం చేసుకుంటుంది?

ఈ పాప ఇప్పుడు మా క్యాంపులో ఉంది భయపడుతూ, వెక్కి వెక్కి ఏడుస్తూ. ఎంతో శ్రమపడి ఆ అమ్మాయిని ఇక్కడికి తేగలిగాము. నేను మొదటిసారి ఆ పిల్లని చూసిన ఆ శిథిల భవనమే ఆమె ఇల్లు కావచ్చు. ఆ ఇల్లు, దాంతోపాటే ఇంట్లోని మనుషులు నాశనమైపోయుంటారు. బడి నుంచి వచ్చేసరికి పాప ఒంటరిదైపోయింది. పాపం! ఆ పాప ఆ రోజు నుంచి అక్కడే ఉంటున్నట్లుంది నిద్రాహారాలు లేకుండా.

ఆ పాప ఏమీ మాట్లాడదు. చాలా కొద్దిగా తింటుంది. తొందరగా నిద్రపోతుంది. నాకు కాస్త అలవాటుపడ్డాక, నేను ఆ పాపతో కళ్ళతో సంభాషించసాగాను.

"మా నాన్న నీలాగే ఉంటారు"

"నా కూతురు నీలాగే ఉంటుంది, అచ్చం నీలాగే. దాదాపు నీ వయసుదే"

"నువ్వు నవ్వుతుంటే మా నాన్న నవ్వినట్లే ఉంటుంది"

"మీ నాన్నెక్కడ ఉన్నారు?"

"తెలియదు. చాలా రోజుల క్రితం ఆఫీసుకని వెళ్ళి తిరిగి రాలేదని మాత్రమే తెలుసు. మా నాన్నలాగే ఇంకా ఎందరో నాన్నలు ఇళ్ళకి చేరలేదట"

"మరి మీ అమ్మ?"

"తెలియదు. తుపాకి గుండేదో తగిలిందని అనుకుంటుంటే విన్నాను"

ఆ పసి బుగ్గలపై కారుతున్న కన్నీళ్ళని తుడిచాను. విషాదం నిండిన కళ్ళతో, విరామం లేకుండా తన కథని చెబుతోంది. నేను మౌనంగా వింటూ అర్థం చేసుకుంటున్నాను.

కళ్ళకి ప్రత్యేకించి ఎటువంటి భాష ఉండదు. అన్ని భాషలు కళ్ళల్లో వ్యక్తమవుతాయి. తన పట్ల జరిగిన వాటిని, ఇతరుల పట్ల జరిగాయని తను విన్న

# వృక్ష ప్రేమికుడు

"కుదరదు. నేను ఒప్పుకోను ..." అంటూ నా హొటల్ ముందున్న చెట్టుని నేను గట్టిగా చుట్టేసుకున్నాను. నా హొటల్ ప్రభుత్వం విస్తరించదలచిన రోడ్డు పక్కనే ఉంది. ఈ రోడ్డులో ఉన్న ఇరవైకి పైగా పచ్చని చెట్లని కొట్టేసి రోడ్డును విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోడ్డు ఇక్కడికి సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ ఐ.టి. పార్కుకి దారి తీస్తుంది. జనాలు నా చుట్టూ మూగారు.

"ఈ చెట్టు నరకాలంటే ముందు నన్ను చంపండి. ఆ తర్వాతే మీరు చెట్టు మీద చెయ్యి వేయగలరు..." అన్నాను.

"అవును ముందు మమ్మల్ని చంపండి" గుంపులోంచి చాలామంది అరిచారు.

కార్పొరేషన్ అధికారికి ఏం చేయాలో పాలుపోలేదు. ఈ ప్రతిఘటన అతడు ఊహించలేదు.

"సార్, ప్లీజ్, జరగండి. లేదంటే పోలీసులని పిలవాల్సి ఉంటుంది" అన్నాడు.

"పిలవండి. మేమూ సిద్ధమే! ఈ వీథిలోని చెట్లను కొట్టేయడానికి మేము ఒప్పుకోం. కొన్ని దశాబ్దాలుగా ఈ చెట్లు ఇక్కడే ఉన్నాయి. ఈ రోడ్డుని ఎన్నో సార్లు విస్తరించారు కాని చెట్లని ఎప్పుడూ కొట్టేయలేదు. ఇప్పుడు కూడా వీటిని మేము కొట్టేయనివ్వం..." దృఢంగా చెప్పాను నేను.

కాసేపటికి పోలీసులు వచ్చారు. కాని ప్రజాబలం ముందు వారు నిలవలేకపోయారు. దాదాపుగా మా పేట పేటంతా అక్కడే ఉంది. మా అందరిదీ ఒకే సంకల్పం. ఏది ఏమైనా మా వీథిలోని ఆ ఇరవైకి పైగా చెట్లని కాపాడుకోడం!

పోలీసు అధికారులు కారణం తెలుసుకోవాలనుకున్నారు.

"సార్. అర్థం చేసుకోండి. రోడ్డుని విస్తరిస్తున్నది మీ కోసమే. రద్దీ తగ్గి, రోడ్డు విశాలమవుతుంది. మీ పేట వాళ్లంతా లాభపడతారు. ఇది ప్రజాశ్రేయస్సు కోసమే! ఎంతో మంది రైతుల నుంచి ప్రభుత్వం ఐ.టి. పార్కు కోసం భూమి సేకరించింది. మీలాంటి ఎందరో పౌరులు (రైతులు) దేశాభివృద్ధికోసం తమ పొలాలపై హక్కులను స్వచ్ఛందంగా వదులుకున్నారు. వాళ్ళని ఆదర్శంగా తీసుకోండి. ఐ.టి. పార్కులాంటి ప్రాంతాలకు రోడ్లు వేసేటప్పుడు కొన్ని చెట్లని నరకడం తప్పనిసరి! తమ భూముల నిచ్చిన ఆ రైతులు చేసిన త్యాగంతో మీ స్వార్థాన్ని పోల్చుకోండి ..." అంటూ నచ్చచెప్పే ప్రయత్నం చేసాడు ఎస్.పి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Naannaa+Tondaragaa+Vacchey+Revised**

* * *